కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి సన్మానించిన రవికుమార్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

వనస్థలిపురం, జనవరి 5 : నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం తమ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారుల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నామన్నారు. అభ్యుదయనగర్ కాలనీలో నూతన రోడ్ల నిర్మాణం, క్రీడా మైదానం, పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి, ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పాస్టర్ వన్య ఇమ్మాన్యూయేల్‌తో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట, జనవరి 5: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మూసారాంబాగ్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్ పాస్టర్ ఎంఎస్ ప్రభుచరణ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, చర్చి పాస్టర్ వన్య ఇమ్మాన్యూయేల్, చర్చి కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని సూచించారు. ప్రేమ, శాంతికి చిహ్నంగా భావించే క్రైస్తవంలో పరుల క్షేమాన్ని కోరి ప్రార్థనలు చేయటం చాలా సంతోషదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ వన్య ఇమ్మాన్యూయేల్, చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎల్బీనగర్, జనవరి 5: లింగోజిగూడ ఎస్సీ శ్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు కమిటీ సభ్యుడు పార్శపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డిని సన్మానించి స్థానిక లింగోజిగూడ విజయపురి కాలనీలోని ఎస్సీ శ్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తను, ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. తక్షణం జేసీబీతో శ్మశాన వాటికను క్లీన్ చేయాలని ఎల్బీనగర్ ఎంఎంఓహెచ్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తూర్పాటి చిరంజీవి, మల్లెపాక యాదగిరి, ఆనంద్‌రాజ్, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్, తదితరులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు...

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గం శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు డివిజన్ అధ్యక్షుడు, నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి దూగుంట్ల నరేశ్, బీఆర్ఎస్ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పార్శపు శ్రీధర్, నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు జోగు కృష్ణ, ఆనంద్‌రాజ్ తదితరులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి స్వీట్లు అందజేశారు.

యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలి

కందుకూరు, జనవరి 5 : యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలని యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి నరేశ్, జైత్వారం మాజీ ఎంపీటీసీ గుండాల సురేశ్ సూచించారు. మండల పరిధిలోని బాచుపల్లి గ్రామంలో యువకులు ముందుకు వచ్చి బీపీఎల్ సీజన్ 7సీ క్రీడలను నిర్వహిస్తున్నారు. క్రీడల్లో 6 టీంలు పాల్గొన్నాయి. టీ షర్టులతో పాటు మొదటి బహుమతి కింద రూ. 12వేలు, ద్వితీయ బహుమతి కింద రూ. 8వేలను నరేశ్ ప్రదానం చేస్తున్నారు. క్రీడలను ప్రారభించిన అనంతరం వారు మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ యువకులు సమష్టిగా ఉండాలని కోరారు. గెలుపు, ఓటములు సమంజసమని, పేర్కొన్నారు. పంతాలు పట్టింపులకు పోవద్దని కోరారు. క్రీడలకు పూర్తి సహకారం ఉంటుందని వివరించారు. క్రీడలతో స్నేహ సంబధాలు ఏర్పాడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎచ్ క్రిష్ణ, దువ్వాసి నరసింహ, నిర్వాహకులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో క్రీడలను ప్రారంభిస్తున్న నరేశ్, సురేశ్

యువకులు స్వశక్తితో ఎదగాలి

అర్జున అవార్డు గ్రహీత రవికాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న యువకులు

కందుకూరు, జనవరి 5 : యువకులు స్వశక్తితో ముందుకు రావాలని అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాచులూరు గ్రామంలో రవీందర్ అనే యువకుడు క్రీడాకారులకు టీ షర్టులను తయారు చేయడానికి ఏర్పాటు చేసిన పరిశ్రమను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సొంత కాళ్లపై నిలబడాలని కోరారు. ఆర్థికంగా ఎదగాలని ఒక రిపైన ఆధార పడవద్దని పేర్కొన్నారు. చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బేతు రాంరెడ్డి, పీఈటీ శేఖర్, యువకులు శివ, మాజీ ఉప సర్పంచ్ శంకర్, నరసింహచారి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

బడంగ్‌పేట, జనవరి5: మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగా దేవాలయంలో, సిరిగిరి పురం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. స్వాములు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. నియోజక వర్గ ప్రజలకు మంచి జరిగే విధంగా అయ్యప్ప కృప ఉండాలని ఆమె అన్నారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, అయ్యప్పలు తదితరులు ఉన్నారు.

పార్క్‌లో సుందరీకరణ పనులు ప్రారంభించాలి

మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జనవరి 5 : ఉద్యానవనంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సుందరీకరణ పనులను సత్వరమే ప్రారంభించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన వీడీసీసీ రోడ్డును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు, మహిళలకు, చిన్నారులకు ఆహ్లాదానికి అందిస్తున్న పార్క్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సుందరీకరణ పనులను త్వరలోనే మొదలుపెడుతామన్నారు. పార్క్‌లో పాత్‌వే, లైటింగ్, గ్రీనరీ, పార్క్ గేట్, పుట్‌పాత్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులను వెంటనే కొనసాగించాలని జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్నను ఆదేశించారు. కాలనీలో సెక్యూరిటీ గేట్లను, రోడ్లు, మురుగునీటి, తాగునీటి వ్యవస్థలను ఆధునీకరణకు చర్యలు తీసుకుంటానని, రోడ్లపై అక్రమ పార్కింగ్ చేసే వాహనాల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. కాలనీ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను సక్రమంగా కొనసాగించాలని, చెత్త కుప్పలు దర్శనమిస్తే తగిన చర్యలు తీసుకుంటానని పారిశుధ్య నిర్వహణ అధికారులను ఆదేశించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను, మహిళలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, మాధవనగర్ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జోగేశ్వరరావు, ట్రెజరర్ శాంతి స్వరూప్, కార్యవర్గ సభ్యులు నర్సింహారావు, ప్రదీప్ రెడ్డి, గిరి, విజయ్, వెంకటేశ్వరరావు, సుజాత, సునీత, రాధిక పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, జనవరి5: దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18, 25 డివిజన్ల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లు బండారి మనోహర్, ముత్యాల లలిత కృష్ణ తదితరులతో కలిసి ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆమె అధికారులకు సూచించారు. శంకుస్థాపనలు చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆమె తెలిపారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించక పోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, బాలు నాయక్, డీఈ జ్యోతి, దిండు శ్రీనివాస్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

వాకర్స్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

సైదాబాద్, జనవరి 5 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఏపీఏయూ కాలనీలో ఆదివారం ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగల విజయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలపై చర్చింటంతో పాటు, పలు అంశాలను నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వాకర్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, కొత్తకాపు రవీందర్ రెడ్డి, జిట్టా సురేందర్ రెడ్డి, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

చర్లపల్లి, జనవరి 5 : నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమానికి తన వంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్‌కు చెందిన చర్లపల్లి పాస్టర్ ఫిలోషిప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని మతాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా క్రిస్మస్ పండుగ నేపథ్యంలో చర్చిల వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. డివిజన్‌లలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, చర్లపల్లి పాస్టర్స్ ఫిలోషిప్ అధ్యక్షుడు బీఏ.పాల్, సభ్యులు నాగేశ్వర్‌రావు, సాల్మన్‌రాజులతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

బడంగ్‌పేట, జనవరి5: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి తీసుకోకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కమిషనర్ సరస్వతి హెచ్చరించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల పై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని నిర్మాణ దారులను ప్రశ్నించారు. మున్సిపల్‌కు సంబంధం లేకుండా ఎవరికి వారు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఎన్ని డివిజన్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో పరిశీలిస్తామన్నారు. నిత్యం అక్రమ నిర్మాణాల పై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అక్రమ నిర్మాణాలు నిజమేనని తన దృష్టికి వచ్చిన్నట్లు అంగీకరించారు. 32 డివిజన్లలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అక్రమ నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇంటి నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. విచ్చల విడిగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి వారిపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని డివిజన్లలో పర్యటిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అక్రమ నిర్మాణాల జాబితా తెలుస్తుందన్నారు. అక్రమ నిర్మాణాల జాబితా పై అధికారులకు అందజేస్తామన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఉంటాయన్నారు. ఇక నుంచి ఎవరైనా మున్సిపల్ అనుమతి తీసుకున్న తర్వాతనే ఇంటి నిర్మాణం చేపట్టాలని హెచ్చరించారు. లేదంటే అక్రమ నిర్మాణాలను తొలగించ వలసి వస్తుందన్నారు.

9వ డివిజన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్డును పరిశీలించిన కమిషనర్ సరస్వతి

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

అధ్యక్ష,కార్యదర్శులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

సైదాబాద్, జనవరి 5 : సమాజంలో సేవా భావం కలిగిన ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం చంపాపేట సామ సరస్వతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్, కల్వకుర్తి, నిజామాబాద్, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, శంకర్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడు గుండె సురేశ్, ప్రధాన కార్యదర్శి బిల్లా కంటి కిరణ్‌కుమార్, కోశాధికారి బద్రీనాథ్ గుప్తా, మహిళా సంఘం అధ్యక్షురాలు దుదిళ్ల రామాదేవి, ప్రధాన కార్యదర్శి కొండూరు రాధిక, కోశాకారి విజయలక్ష్మి, ఆర్యవైశ్య సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేశ్ గుప్తా, రాజకీయ కమిటీ చైర్మన్ గడ్డం నందకిషోర్, విద్యాకమిటీ చైర్మన్ నాగబండి నగేశ్ గుప్తాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆర్యవైశుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది రాజకీయాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా తాజా మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణిగుంట్ల గణేశ్ గుప్తా, కోశాధికారి కొండె మల్లికార్జున్, రాజకీయ కమిటీ చైర్మన్ చింతల రవికుమార్ గుప్తా, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి ఊరే లక్ష్మణ్‌గుప్తా, అగిరి వెంకటేశ్, లక్ష్మయ్య, మొగుళ్ల పల్లి ఉపేందర్, పసునూరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు బిక్కుమాండ్ల చంద్రశేఖర్, చీకటిమల్ల లోకేశ్, గుండా విజయరాములు, బాదం చంద్రశేఖర్, ఉరే రవీందర్, నీలా మధుసూదన్ గుప్తా, అగిరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే మహిళ లకు స్ఫూర్తి

సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, మా భూమి సభ్యులు

వనస్థలిపురం, జనవరి 5 : భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తి అజరామరమైందని షీటీమ్స్ మాజీ ఇన్‌చార్జి, ఐపీఎస్ అధికారి శిరీష రాఘవేంద్ర అన్నారు. మా భూమి సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మహిళలో ఆమె స్ఫూర్తిని కలిగి ఉండాలని ఆకాంక్షించారు. సావిత్రిబాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ ఆడ పిల్లల చదువు సమాజానికి ఎంతో అవసరమన్నారు. మహిళా చదువుకుంటే కుటుంబం, సమాజం, దేశం పురోగతిలో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్బీనగర్ కోర్టు జడ్జి నిష్క పాత్రుడు, సామాజిక కార్యకర్త ముకుంద మాల ప్రత్యేక అతిథులుగా హాజరై సందేశాన్నిచ్చారు. మా భూమి సంస్థ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మా భూమి మహిళా సభ్యులు శరణ్య, అలివేలు మంగ, వనజా, సుమన్, భవాని, చంద్రకళ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

రామంతాపూర్,జనవరి 5 : సీసీ రోడ్లలో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ హెచ్చరించారు. శ్రీనగర్ కాలనీ పరిధిలో 54 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లలోకాంట్రాక్టర్ నాణ్యత పాటించే విధంగా ఎప్పటి కప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 5 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్-8 డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జమాల్ కాలనీ, 11కేవీ మూసారాంబాగ్, 11కేవీ పల్టన్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ అరుంధతి కాలనీ, 11కేవీ గడ్డిఅన్నారం, 11కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4. 30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆండాళ్ నిలయంలో అన్నదానం

మలక్‌పేట, జనవరి 5: 38వ తిరుప్పావై ధనుర్మాస తిరు నక్షత్రోత్సవాల్లో భాగంగా మాతృ శ్రీ రిందాదేవి తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని మూసారాంబాగ్ ఆండాళ్ నిలయంలో ఆదివారం గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు, హారతి, మంగళాశాసనాలు, ప్రసాద వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాళ్ నిలయం నిర్వాహకులు లక్ష్మీదేవి, రూపాదేవిలు మాట్లాడుతూ డిసెంబర్ 16న ప్రారంభమైన తిరుప్పావై ప్రవచనోత్సవాలు జనవరి 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులకు ఉత్తర (వైకుంఠ)ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

ముగ్గుల పోటీలు

మన్సూరాబాద్, జనవరి 5: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పద్మనాయక వెలమ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పార్క్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలో, వెలమ సామాజికవర్గానికి చెందిన మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన మహిళలకు అసోసియేషన్ వారు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన చిన్నారులకు బోడలు పోసి ఆశీర్వదించారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆటలు, దాండియా పాటలతో వీక్షకులను అలరింపజేశారు. బీఆర్ఎస్ మహిళా నేత పడకంటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.